జై హనుమాన్



వార్షికోత్సవానికి ముస్తాబైన సుందర అభయాంజనేయ స్వామి ఆలయం

- నేడు సుందర అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం
- తాటిచెట్లపాలెంలో భారీ పరస
- 25 ఏళ్లుగా మహాశివరాత్రి రోజున ఘనంగా నిర్వహణ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్ల పాలెంలో జాతీయ రహదారి పక్కన వెలసిన సుందర అభయాంజనేయ స్వామి ఆలయం 25వ వార్షికోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భారీ పరస మహోత్సవం జరగనుంది. హనుమ నామం జపిస్తూ వేకువజాము నుంచి స్వామికి భక్తులు విశేష పూజలు చేయనున్నారు. 25 ఏళ్లుగా ప్రతి ఏటా మహాశివ రాత్రి పర్వదినాన ఆలయ వార్షికోత్సవం, పరస ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 5 గంటలకు మహా రుద్రాభిషేకంతో వేడుకలు ప్రారంభమవుతాయి. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. వివిధ పార్టీల నాయకులు, స్థానిక నేతలు పాల్గొనున్నారు.

వీరి ఆర్థిక సాయంతో..

ఈ పరస నిర్వహణకు విశాఖ–కాకినాడ పెట్రో కెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ చైర్‌పర్సన్ చొక్కాకుల లక్ష్మీవెంకటరావు, 45వ వార్డు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, మాజీ కార్పొరేటర్ పైల ముత్యాలనాయుడు, ఎన్.శ్రీనివాసరెడ్డి, పలిశెట్టి అప్పన్నలు ఆర్థిక సాయం చేసినట్లు ఆలయ అధ్యక్షుడు ఆళ్ల నరసింగరావు తెలిపారు.



సుందర అభయాంజనేయుడు

25వ వార్షికోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు సహకారంతో ఆయన చేతుల మీదుగా ఇంతకాలం ఇక్కడ విశిష్ట సేవలందించిన పలువురు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులను ఘనంగా సత్కరించనున్నట్లు ఆలయ కమిటీ మెంబర్, ఆటా–పాటా నిర్వాహకుడు పలిశెట్టి అప్పన్న తెలిపారు. ఇక్కడ జరిగే ప్రత్యేక కార్యక్రమాలకు పలువురు ప్రత్యేక అతిథులు హాజరు కానున్నారు.

ఆటా–పాటా కార్యక్రమాలు

సాయంత్రం నుంచి ఆలయం వద్ద పరస మహోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. విద్యుద్దీపాలంకరణ, భారీ సౌండ్ సిస్టంలతో విజయనగరం జిల్లా గజపతినగరం, కొండపేట గ్రామానికి చెందిన శంకర్ బృందంచే రేలా రే రేలా, పవన్ డీజే సౌండ్స్ ఆధ్వర్యంలో ఎస్ఎస్ డ్యాన్స్ ట్రూప్ వారి ఆటా–పాటా వంటి పలు కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆళ్ల నరసింగరావు తెలిపారు. ప్రజలంతా తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

శివ నామస్మరణకు వేళాయె..

- నేడు మహాశివరాత్రి పర్వదినం
- ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు

సీతంపేట: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయాల్లో శనివారం వేకువజాము నుంచి ఆదివారం ఉదయం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు శంకర మఠం రోడ్డు రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయం, సీతంపేటలోని పార్వతీశ్వరాలయం, అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి వద్ద గౌరీపరమేశ్వరుల ఆలయాలను చూడముచ్చటగా అలంకరించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. లలితానగర్‌లోని లలితా పీఠంలో వేకువజాము నుంచి విశేష అభిషేకాలు, హోమాలు జరగనున్నాయి..

శంకరమఠంలో..

కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి జన్మదినం, మహాశివరాత్రి సందర్భంగా శంకరమఠంలో శనివారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ద్విసహస్ర మోదక హోమం, మహా రుద్ర హోమం, శతచండీ హోమం, 54 మందికి వటుక పూజ, 54 మందికి కన్యా పూజ, 54 మందికి సువాసినీ పూజ, 54 మందికి వేద పండిత పూజ, 54 మందికి వేద పండిత దంపతి పూజ, సంప్రదాయ పాఠశాలల విద్యార్థులచే శ్రీశంకరాచార్య విరచిత స్తోత్ర మంజరి, మెండలీన్ వాద్య కచేరీ, నమక చమక పారాయణం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని శంకర మఠం కార్యవర్గం తెలిపింది.



మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైన రామలింగేశ్వరాలయం

రైల్వే న్యూకాలనీ ధ్యాన మందిరంలో..

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ ప్రాంగణంలోని శివుడు, నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామిలకు శనివారం ఉదయం 8 గంటల నుంచి భక్తుల స్వహస్తాలతో అభిషేకం చేస్తున్నట్లు మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం వరకూ అభిషేకాలు జరుగుతాయన్నారు. శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ధ్యాన మందిర ప్రాంగణంలో గల్లా చిట్టిబాబు బృందంచే భక్తి గీతాలాపన, రాత్రి 10 గంటల నుంచి ఆదివారం ఉదయం 5 గంటల వరకు బాబా వారి భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శేషు చెప్పారు.

క్లుప్తంగా

మాతృమూర్తులకు పాదాభివందనం



జ్ఞాననికేతన్ స్కూల్‌లో తల్లుల పాదాలకు పూజ చేస్తున్న విద్యార్థులు

సీతంపేట: అమ్మ గొప్పతనం పిల్లలకు తెలిసేలా అక్కయ్యపాలెం జ్ఞాననికేతన్ స్కూల్‌లో శుక్రవారం పాదాభివందన కార్యక్రమం నిర్వహించారు. 8, 9, 10 తరగతి విద్యార్థులు వారి తల్లుల పాదాలు కడిగి పూజ చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ సునీత కుమారి మాట్లాడుతూ మాతృదేవోభవ అంటే ప్రతి ఒక్కరికీ తల్లే మొదటి గురువని పేర్కొన్నారు. తల్లి గొప్పతనం పిల్లలకు తెలియ చెప్పడానికే ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవ వేంకటేశ్వరుడికి నేడు సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తామన్నారు. అనంతరం స్వామికి అభిషేకాలు, ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 8.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుందని చెప్పారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేస్తామన్నారు. సాయంత్రం 6.45 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పిస్తామని తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం

సీతంపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ అక్కయ్యపాలెంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలు పాఠశాలకు వెళ్లి టీచర్లను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు తనకు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకుడు రాజు, మహిళా సంఘాల నాయకులు మాధవి, పోర్టు యూనియన్ నాయకుడు స్వతంత్రకుమార్, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి నాయుడు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారుల్లో డెబ్రిస్ తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

కంచరపాలెం: కంచరపాలెం నుంచి తాటిచెట్లపాలేనికి వెళ్లే రహదారుల్లో ఇష్టానుసారంగా డంప్ చేసిన డెబ్రిస్‌ను శనివారం తొలగించారు. ఇక్కడ రహదారికి ఇరువైపులా పడవేసిన భవన నిర్మాణ వ్యర్థాలు, పశు కళేబరాలతో స్థానికులు, పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ సమస్యపై 'డంపింగ్ యార్డుల్లా రహదారులు' అనే శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో వెలువడిన కథనానికి జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తక్షణం స్పందించారు. ఈమేరకు పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, సూపర్‌వైజర్ జనార్దన్‌ల పర్యవేక్షణలో శానిటరీ సిబ్బంది పొక్లెయిన్‌తో డెబ్రిస్‌ను తొలగించి తరలించారు. రహదారులపై వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, డంపింగ్‌కు వినియోగించిన వాహనాలను సీజ్ చేస్తామని జెడ్సీ కృష్ణ హెచ్చరించారు.



కంచరపాలెం మలుపు వద్ద పొక్లెయిన్‌తో డెబ్రిస్‌ను తొలగిస్తున్న సిబ్బంది

నేవీ సిబ్బంది పుస్తక ప్రదర్శన

మల్కాపురం: భారతీయ నావికాదళ సిబ్బంది వారి కుటుంబాల్లో పుస్తక పఠనాన్ని అలవాటుగా పెంపొందించుకోవడం కోసం పుస్తక ప్రదర్శన ప్రారంభించారు. 104 ఏరియాలోని కమ్యూనిటీ హాల్‌లో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఫిక్షన్, నాన్ ఫిక్షన్, బయోగ్రఫీలు, ఆత్మకథలు, అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన వివిధ రకాల పుస్తకాలను ప్రదర్శనలో పొందుపరిచారు. అధ్యయనాలు, సముద్ర సంబంధిత, అకడమిక్ పుస్తకాలు మొదలైనవి ప్రదర్శించారు. నౌకాదళ సిబ్బంది, నేవీ చిల్డ్రన్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం–2 నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయలు కుటుంబాలతో కలిసి ప్రదర్శనను తిలకించారు.



ప్రదర్శనలో పుస్తకాలు చూస్తున్న విద్యార్థులు

ఎస్ఈఆర్‌టీ డైరెక్టర్‌పై దాడి అమానుషం

మురళీనగర్: ఎస్ఎస్ఈఆర్‌టీ డైరెక్టర్, వైఎస్సార్ (కడప) జిల్లా ఆర్‌జేడీ బి.ప్రతాపరెడ్డిపై కొందరు దుండగులు దాడి చేయడం అమానుషమని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిరికి శ్రీనివాసరావు, ఇమంది పైడిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా వ్యవస్థలో ఉన్నతాధికారిగా అందరి మన్ననలు పొందుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ప్రతాపరెడ్డి విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో కొందరు దుండగులు దాడికి పాల్పడటం వారి పిరికిపంద చర్యకు నిదర్శనమన్నారు. ఉపాధ్యాయుల్లో స్ఫూర్తిని నింపుతూ విద్యా సంస్కరణల అమలులో తనదైన శైలితో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్న మంచి మనిషిపై భౌతిక దాడులకు దిగడం సమంజసం కాదన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తరపున రక్షణ కల్పించాలని కోరారు. ప్రతాపరెడ్డి లాంటి ఉత్తమ అధికారికి ఉపాధ్యాయ లోకం ఎల్లప్పుడూ మద్దతుగా నిలుస్తుందని వారు చెప్పారు.

ప్రతాపరెడ్డిపై దాడి హేయమైన చర్య

విశాఖ విద్య: ఆర్జేడీ ప్రతాపరెడ్డిపై దాడి హేయమైన చర్య అని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి. గోపీనాథ్, ఎం. శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్యంలో భౌతికదాడులు సరైన పద్ధతి కాదన్నారు. విద్యాశాఖ పనితీరు పురోగతికి ఆర్జేడీ ప్రతాపరెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అలాంటి అధికారికి పీఆర్‌టీయూ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.

వాల్తేర్ డివిజన్‌లో రైల్వే జీఎం తనిఖీలు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా మనోజ్ శర్మ వాల్తేర్ డివిజన్ పరిధి పలాస–విశాఖపట్నం సెక్షన్‌లో డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతితో కలిసి శుక్రవారం విండో ఇన్‌స్పెక్షన్ చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా పలాస–విశాఖపట్నం సెక్షన్‌లోని ట్రాక్స్, మలుపులు, వంతెనలు, పాయింట్స్ అండ్ క్రాసింగ్స్, సిగ్నలింగ్, పలు భద్రతా విషయాలను పరిశీలించారు. జీఎం, డీఆర్ఎంలతోపాటు ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన వివిధ విభాగాల ప్రిన్సిపల్ హెడ్స్, వాల్తేర్ డివిజన్‌కు చెందిన బ్రాంచ్ అధికారులు పాల్గొన్నారు.



డివిజన్ కార్యకలాపాలు, పనితీరును పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జీఎం మనోజ్ శర్మకు వివరిస్తున్న డీఆర్ఎం సత్పతి

వివిధ విభాగాధిపతులతో సమావేశం..

జీఎం మనోజ్ శర్మ విశాఖ చేరుకున్న తరువాత డీఆర్ఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో వివిధ విభాగాధిపతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, డివిజన్ పనితీరు, అవలంబిస్తున్న భద్రతా ప్రమాణాలు, అనుసరిస్తున్న ఆధునిక పద్ధతులను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జీఎంకు డీఆర్ఎం సత్పతి వివరించారు. యూనియన్ నాయకులు డీఆర్ఎం కార్యాలయంలో మనోజ్ శర్మకు స్వాగతం పలికారు.

రైల్వే ట్రాక్‌పై వ్యక్తి మృతదేహం

మల్కాపురం: మల్కాపురం రైల్వే స్టేషన్ దగ్గరలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. శుక్రవారం తెల్లవారుజామున పలువురి సమాచారం మేరకు సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయసున్న ఒక వ్యక్తి మృతదేహం పట్టాలపై ఉండటాన్ని గవర్నమెంట్ రైల్వే పోలీసులు గుర్తించారు. సదరు వ్యక్తి నీలం రంగు జీన్స్ ఫ్యాంట్, నీలం రంగుపై తెల్లని చుక్కలు ఉన్న ఫుల్ హ్యాండ్స్ చొక్కా వేసుకుని ఉన్నాడని, పారాగాన్ కంపెనీ చెప్పులు ధరించి, ముఖం గుర్తుపట్టలేని విధంగా చిట్లిపోయి ఉందని పోలీసులు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని జీఆర్‌పీ ఎస్ఐ బాలకృష్ణ చెప్పారు.

పందుల బెడద



మల్కాపురం రైల్వే క్వార్టర్స్‌లో గుంపుగా సంచరిస్తున్న పందులు

మల్కాపురం: మల్కాపురం రైల్వే క్వార్టర్స్‌లో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. అసలే అనారోగ్యాలు ఎక్కువగా ఉంటున్నాయి. దీనికి తోడు పందుల సమస్యతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఒంటరిగా వెళ్లాలంటే ఎక్కడ దాడి చేస్తాయోనని భయపడుతున్న పరిస్థితి నెలకొంది. పిల్లలు, మహిళలు ఎవరైనా బయటకు వెళ్లాల్సి వస్తే వెంటపడుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఇంతకు ముందు వ్యర్థాలు, చెత్త సమస్య ఉండేది. ఇప్పుడు పందుల బెడద అధికమైంది. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కాలనీవాసులు కోరుతున్నారు.

10 నుంచి కళాకారుల క్రికెట్ టోర్నమెంట్



టోర్నీ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి తదితరులు

అల్లిపురం: విశాఖపట్నం కళాకారుల క్రికెట్ టోర్నమెంట్ బ్రోచర్‌ను మేయర్ గొలగాని హరి వెంకట కుమారి జీవీఎంసీలోని తన చాంబర్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాకారుల సంఘం అధ్యక్షుడు జనార్దన్ మాట్లాడుతూ జ్ఞానాపురం గోల్డెన్ జూబ్లీ స్కూల్‌లో మార్చి 10 నుంచి 12వ తేదీ వరకు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, విష్ణు పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ యాదవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

53వ వార్డులో కె.కె.రాజు పర్యటన



వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజుకు సమస్యను వివరిస్తున్న శివనగర్ వాసులు

మల్కాపురం: జీవీఎంసీ 53వ వార్డులో శుక్రవారం కార్పొరేటర్ బర్కత్ అలీతో కలిసి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పర్యటించారు. మల్కాపురం శివనగర్ వాసులు తాము ఏర్పాటు చేసుకున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎదురవుతున్న ఇబ్బందులను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ఈ సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, నాయకులు షేక్ బాబ్జి, ఝాన్సీ, సదరం జ్ఞానేష్, కనకరాజు, హనుమంతు, జ్యోత్స్న, షేక్ నబి, సూర్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్యాలు

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం నిర్వహించిన నృత్యప్రదర్శన భక్తులను అలరించింది. శ్రీనృత్య నికేతన్ వ్యవస్థాపకులు సిహెచ్.శ్రావణి ఆధ్వర్యంలో ఆమె శిష్య బృందం చేసిన భరతనాట్యం, కూచిపూడి నృత్యప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. మూషిక వాహన, శివ అష్టకం, శ్రీవిఘ్నరాజంభజే, అదివో అల్లదివో, శ్యామలే మీనాక్షి, ఆనంద నర్తన గణపతి, కాల భైరవ అష్టకం, పార్వతి వల్లభ అష్టకం, ఒకపరి కీర్తనలకు నృత్యాలు చేశారు. నృత్య బృందాన్ని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ అభినందించారు.



నృత్యంతో అలరిస్తున్న చిన్నారులు

నడకతోనే ఆరోగ్యం

మురళీనగర్: ప్రతి రోజు నడవడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని ఓం వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రమీల అన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ విద్యా శాఖ మంత్రి దివంగత సుంకర ఆల్వార్‌దాస్ ఆశయంలో భాగంగా క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మురళీనగర్‌లోని అపూర్వ స్కూల్‌లో విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుకు పరిమితం కాకుండా క్రీడల్లో పాల్గొనాలన్నారు. ప్రతి రోజు కనీసం 30 నిమిషాలు నడవడంతోపాటు చిన్నపాటి వ్యాయామాలు చేయాలని సూచించారు. యోగాసనాలు, సూర్యనమస్కారాల ద్వారా ఆరోగ్యం మరింత మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. ముందుగా సుంకర ఆల్వార్‌దాస్ చిత్రపటానికి నివాళులర్పించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు జగదీష్ విద్యార్థులతో వ్యాయామం చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మురళీ పట్నాయక్, క్లబ్ కార్యదర్శి పుష్ప పాల్గొన్నారు.



ఆల్వార్‌దాస్‌కు నివాళులర్పిస్తున్న ఓం వాకర్స్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు

యువతలో నైపుణ్యాభివృద్ధే లక్ష్యం



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న జేసీఐ ప్రతినిధులు


అల్లిపురం : యువతలో వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యంతో పాటు జీవనోపాధి అవకాశాలు పెంపొందించడమే తమ లక్ష్యమని జేసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ సుశాంత్ తెలిపారు. నగరంలోని ఒక హోటల్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా జేసీఐ వైజాగ్ స్మార్ట్, జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ యువతలో సానుకూల మార్పులకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. జేసీఐ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నాయకత్వ లక్షణాలు, మేనేజ్‌మెంట్, టీం స్కిల్స్, వృత్తి నైపుణ్యం తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 18 నుంచి 40 ఏళ్ల వయసులో ఉన్నవారికి ఈ శిక్షణను అందిస్తున్నామన్నారు. సమావేశంలో జేసీఐ ప్రతినిధులు శిరీష్ దుండు, రజిత, సచిన్ కుర్తీకర్, వర్మ, విధి గుప్తా, రాజేష్, స్రవంతి, సంగీత, కావ్య తదితరులు పాల్గొన్నారు.

సేవతోనే జీవితానికి సార్థకత

అల్లిపురం: సామాజిక సేవతోనే మనిషి జీవితానికి సార్థకత లభిస్తుందని ప్రేమ సమాజం కార్యదర్శి కోన జగదీశ్వరరావు పేర్కొన్నారు. కోన కుంచయ్య చారిటబుల్ ట్రస్ట్, విజయసాయి యోగా చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కార్మికులు, నిరుపేదలకు నిత్యావసర వస్తువుల పంపిణీ చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్లు మహాలక్ష్మి, అప్పలరాజు, మురళీకృష్ణ, అవినాష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన అవసరం

ఆరిలోవ: మానవ హక్కులపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ప్రపంచ మానవ హక్కుల సమితి (డబ్ల్యూహెచ్ఆర్సీ) జాతీయ చైర్మన్ ఆర్. బాలాజీ సూచించారు. ఆరిలోవ ప్రాంతం హెల్త్ సిటీలోని ఓ హోటల్‌లో మానవ హక్కుల ప్రతినిధుల రాష్ట్ర సమావేశం శుక్రవారం నిర్వహించారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, అవగాహన సదస్సులపై చర్చించారు. అనంతరం సమితి కార్యాచరణతో కూడిన క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హక్కులతోపాటు బాధ్యతలు తెలుసుకోవాలని సూచించారు. ప్రతి అంశంపైనా అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలలు, వృద్ధులు, మహిళలు తమకు జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నించడానికి ముందుకు రావాలని సూచించారు. సమాజంలో వివక్ష పెరిగిపోతోందని, దాని నుంచి బయటపడడానికి ప్రయత్నించాలన్నారు. యువతలో అవగాహన కలిగించడానికి విద్యార్థులకు కళాశాలల్లో మాక్ పార్లమెంట్ నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో విశాఖలోనే మాక్ పార్లమెంట్ కార్యక్రమాలు ప్రారంభిస్తామని తెలిపారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సమితి ప్రతినిధులు